క్లుప్తంగా

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



శిరివెళ్లలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

శిరివెళ్ల: మండల కేంద్రంలోని మంగలిపేటలో నాయీబ్రాహ్మణులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. చేదోడు కింద 4వ విడత ఆర్థిక సహాయాన్ని అందజేసినందుకు కృతజ్ఞతగా పాలాభిషేకం చేశారు. జిల్లా బీసీ సంఘం కార్యదర్శి మంగళి బాల వెంకట రమణ మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. రజక, టైలర్లు, నాయీ బ్రాహ్మణలకు ఆయన అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కార్యవర్గ ఎన్నిక

గోస్పాడు: జిల్లెల్ల గ్రామానికి చెందిన శ్రీరామ నందీశ్వరస్వామి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఈఓ వీరయ్య తెలిపారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన శ్రీరామనందీశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నూతన ధర్మకర్తల కార్యవర్గం సభ్యులకు శనివారం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా లక్ష్మీరెడ్డి, ధర్మకర్తలుగా నాగరాజు, మంగళి లక్ష్మీదేవి, జమాలయ్య, గురువయ్య, బెస్త లక్ష్మీదేవి, తిరులమ్మలు, అర్చకులు శేషాద్రి శర్మ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా

• పది మందికి గాయాలు

రుద్రవరం: తిప్పారెడ్డి పల్లె మెట్ట వద్ద ట్రాలీ ఆటో బోల్తా పడిన ఘటనలో పదిమంది కూలీలు గాయపడ్డారు. టీ.లింగదిన్నెకు చెందిన కొంత మంది కూలీలు కొద్ది రోజులుగా ఉయ్యాలవాడ మండలం పాంపల్లె గ్రామంలో పత్తి పొలాల్లో పనులకు వెళ్తున్నారు. శనివారం ఆటోలో వెళ్తుండగా తిప్పారెడ్డిపల్లె సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ ఘటనలో ఆటోలో ఉన్న పది మందికి గాయాలు కాగా 108లో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

27న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి ఈ నెల 27వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. ఈ సర్వీసుకు చెందిన టికెట్లను బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్, apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

నేడు దసరా వేషాల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): కళాకారుల ప్రోత్సాహంలో భాగంగా దసరా వేషాల పోటీల నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. నంద్యాలలో దసరా వేషాలు అంటే ఒక ప్రత్యేకత ఉందని, అలాంటి కళ అంతరించిపోకుండా తన సొంత ఖర్చులతో పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20వేలు, అదే విధంగా పోటీలో పాల్గొనే ప్రతి టీంకు గౌరవ బహుమతి అందజేస్తున్నట్లు వారు తెలిపారు. స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి ప్రారంభమవుతున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు వివరాల కోసం 8341901968, 8328284649ను సంప్రదించాలన్నారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం



రాంభూపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

ఉయ్యాలవాడ: శాంతి భద్రతల పరిరక్షణలో వీర మరణం పొందిన అమరుల త్యాగం చిరస్మరణీయమని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్ అన్నారు. శనివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లూరు గ్రామంలో విధి నిర్వహణలో అమరుడైన ఆరికట్ల రాంభూపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2000 మార్చి 7న యాదగిరి గుట్ట సమీపంలో జరిగిన నక్సలైట్ల దాడిలో అప్పటి హోంమంత్రి మాధవరెడ్డిని కాపాడబోయిన గన్‌మెన్‌గా విధుల్లో వున్న రాంభూపాల్‌రెడ్డి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నిరంజన్ మృత్యువాత పడ్డారన్నారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, మాజీ గ్రామ ఉప సర్పంచ్ కూలూరు రామక్రిష్ణారెడ్డి, న్యాయవాది మల్లికార్జున్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఆరికట్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలపాడులో..

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో శనివారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు.



దొర్నిపాడులో..

దొర్నిపాడు: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు బాల త్రిపురసుందరి దేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



శిరివెళ్లలో..

శిరివెళ్ల: దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. అన్నదాన, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపట్టారు.



ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ: శ్రీ మత్యకన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. శనివారం హోమం, కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పసురపాడులో..

గోస్పాడు: పసురపాడు గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వరస్వామి, శ్రీలింగమయ్య స్వామి ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అలంకరించారు.



రుద్రవరంలో..

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయం లో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్య వైశ్య సంఘం సభ్యులు అమ్మవారిని రోజుకో అలంకారం గావించి విశేష పూజలందిస్తున్నారు.



ఇంజేడులో..

ఉయ్యాలవాడ: దసరా శరన్నరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే!

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం పలు దేవాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో నెలకొలిప్న అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. కాళరాత్రి దుర్గాదేవి, గాయత్రిదేవి, మహాలక్ష్మిదేవి, శ్రీకూష్మాండదేవి, మహాగౌరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీకాళికాంబదేవస్థానంలో శ్రీకాళికాంబదేవి శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులను కరుణించారు.

- స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు ఉదయమే పంచామృతాభిషేకాలు నిర్వహించి శ్రీవైష్ణవిదేవిగా అలంకరించారు.
- బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకోటి సుబ్బమ్మ కల్యాణ మండపంలో లలితా సహస్ర నామ పారాయాణం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక మండపంలో అమ్మవారిని శ్రీగాయత్రి దేవిగా అలంకరించారు.
- సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఉదయమే సుప్రభాతసేవలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. అమ్మవారిని కాలరాత్రి దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవిని శ్రీకాళరాత్రిదేవి, మహాగౌరీ దేవిలుగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.
- స్థానిక గుడిపాటిగడ్డలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో అభిషేకాలు, గంధాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు.
- జగజ్జననీ నగర్‌లోని శ్రీజగజ్జననీ దేవాలయంలో సామూహిక రాహుః కాల పూజలు నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు.
- కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో దేవినవరాత్రులను పురస్కరించుకొని ఉదయమే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశస్థాపన, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో అలంకరించారు.
- బొమ్మలసత్రం షిర్డిసాయి దేవాలయంలో అమ్మవారి విగ్రహానికి శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- రెవెన్యూ క్వార్టర్స్ శ్రీరాజరాజేశ్వరిదేవి అలకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.



బ్రహ్మనందీశ్వరస్వామి దేవాలయంలో కాళరాత్రి దేవి, మహాగౌరీదేవి అలంకారంలో అమ్మవారు



బాలాజీ కల్యాణ మండపంలో శ్రీ గాయత్రిదేవిగా



శ్రీ వైష్ణవిదేవి అలంకారంలో వాసవీ మాత



డ్రైఫ్రూట్స్ అలంకారంలో అయ్యప్పస్వామి

కన్యకా పరమేశ్వరీదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చాగలమర్రి: స్థానిక శ్రీమత్కన్యా కాపరమేశ్వరీదేవిని, శ్రీచెన్నకేశవస్వామిని శనివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ ధర్మకర్త క్రిష్టం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంకదార లక్ష్మణ బాబు, ఉపాధ్యక్షులు బీవీ సుబ్రమణ్యం, అర్చకులు రాధాకృష్ణ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన చేన్నకేశవస్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబులాల్, మండల వైఎస్సార్ అధ్యక్షులు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకుడు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల: నంద్యాల శివారులోని నంద్యాల–కర్నూలు వెళ్లే రహదారిలో పొగాకు కంపెనీ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఎకరా భూమిలో జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నామని కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్‌బాషా, రామసుబ్బారెడ్డి, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ సలహాదారు హబీబుల్లా, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, ఆర్థర్, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి, శాంతిరాం విద్యాసంస్థల అధినేత మిద్దె శాంతిరాముడు, ఏపీఎఫ్‌పీఐఎఫ్ అధ్యక్షుడు కల్లూరు రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయ భూమి పూజలో పాల్గొన్న మంత్రులు పెద్దిరెడ్డి, అంజాద్‌బాషా, బుగ్గన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి, శిల్పా రవి, ఎమ్మెల్సీలు తదితరులు

రీ సర్వే వేగవంతం చేయండి

• జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రీసర్వే, స్పందన గ్రీవెన్స్, ఆర్‌ఓఆర్ కేసులు, ఏపీ సేవా సర్వీసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూము లు, పొరసరఫరాలు, కోర్టు కేసులు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. భూ వివాదాలకు సంబంధించి స్పందన కార్యక్రమంలో అనేక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత తహసీల్దారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్‌ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలన్నారు. సర్వే బృందాలు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర ప్రక్రియలను ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రామాల అవార్డ్స్‌ను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి నిత్యావసర సరుకుల పంపిణీలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాబోలు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నియోజకవర్గ ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గతంలో రాజకీయ నాయకుడు వస్తున్నాడంటే సమస్యలు స్వాగతం పలికేవని, ప్రస్తుతం సంక్షేమ ఫలాలతో ప్రతి కుటుంబం కళకళలాడుతుందన్నారు. రూ.లక్షల్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ, దానికి అనుసంధానంగా వలంటరీ వ్యవస్థ, ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయన్నారు. నాలుగున్నరేళ్లల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ చెన్నయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తమరెడ్డి, ఉప సర్పంచ్ హుసేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగనందిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మదార్‌సా, తిమోతి, బాలహుసేన్, అహమ్మద్ హుసేన్, పాలబాషా, విశాల్‌రెడ్డి, మధుగోపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్, శివనారాయణ పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

అయోడిన్ రుగ్మతలపై అవగాహన అవసరం

నంద్యాల టౌన్: అయోడిన్ (ఉప్పు) లోపం వల్ల వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. శనివారం అయోడిన్ లోపం–రుగ్మతలు–నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రామాణికమైన అయోడిన్ ఉపయోగించడంతో కలిగే లాభాలను వివరిస్తూ ఈ నెల 27 వరకు నిర్వహించే కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు కరపత్రాలతో ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ ర్యాలీలో ఎన్‌సీడీ–సీడీ, ఆర్‌బీఎస్‌కే అధికారి కాంతారావు నాయక్, ఆరోగ్య శ్రీ జిల్లా కో– ఆర్డినేటర్ రూపేంద్రనాథ్ రెడ్డి , ఏఓ చంద్రశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అయోడిన్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

గోస్పాడు: అయోడిన్ లేని ఉప్పు ఆరోగ్యానికి హానికరమని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావు నాయక్ అన్నారు. జూలేపల్లె గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం పరిశీలించారు. అయోడిన్ లోపం–రుగ్మతలు, నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల్లో తప్పని సరిగా అయోడిన్ ఉప్పు వాడాలన్నారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ స్లీపర్ సర్వీస్

నంద్యాల టౌన్: నంద్యాల నుంచి హైదరాబాద్‌కు నూతన స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు సర్వీసును ప్రారంభించినట్టు నంద్యాల డిపో మేనేజర్ గంగాధర్ రావు శనివారం తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బీహెచ్‌ఈఎల్ వరకు నాన్ ఏసీ స్లిప్పర్ బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. ఈ సర్వీసు నందాల నుంచి ఆది, మంగళ, గురువారాలు రాత్రి 10.05 గంటలకు ప్రారంభమవుతుందని, హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్) నుండి సోమ, బుధ, శుక్ర వారా ల్లో రాత్రి 10.15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సర్వీసులో లోయర్ బెర్త్ టికెట్ రూ.790, అప్పర్ బెర్త్ టికెట్ రూ. 730 గా నిర్ణయించామన్నారు. వివరాల కోసం రిజర్వేషన్ కౌంటర్‌లో లేదా apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం



ఆర్.నాగులవరంలో వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి అన్నారు. ఆర్.నాగులవరంలో శనివారం ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి జయలక్ష్మి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ యార్డు చైర్మెన్ ప్రారంభించి వృద్ధులకు కంటి అద్దాలు అందజేశారు. శిబిరంలో వైద్య సిబ్బంది 553 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ఇంతకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతపై దృష్టి సారించి ఇలా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి దుకుంటున్నారని అన్నారు. శిబిరాన్ని తెలుగుగంగ ఎస్‌ఈ వెంకటరమణ, డీఎల్‌డీఓ జానార్దన్‌రావు పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

ఉయ్యాలవాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఓపీ రిజిస్టర్ నమోదు, కంటి పరీక్షలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను ఆమె పరిశీలించి కంటి పరీక్షలు కూడా చేయించుకున్నారు. శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్‌కుమార్, జనరల్ సర్జన్ ఎండీ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యాధికారులు శివలింగమ్మ, రాబర్ట్ కెనడీ, వెంకటసుబ్బయ్య, కంటి వైద్య నిపుణులు రమేష్ 461 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 84 మందికి కంటి పరీక్షలు, 153 మందికి రక్త పరీక్షలు, 270 మందికి బిపి సుగర్, 29 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పేరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు శింగిరెడ్డి దస్తగిరి రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వైద్య బృందం పాల్గొన్నారు.



తుడమలదిన్నెలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుణ్యలక్ష్మీదేవి తదితరులు

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

చాగలమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిరుపేద ప్రజలకు వరంగా మారిందని చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ తులశమ్మ అన్నారు. శక్రవారం చాగలమర్రి ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఈఓపీఆర్డీ సుదర్శనరావు, ఎంపీడీఓ మహబూబ్ దౌలాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్లు కిషోర్, షబరీష్, ఇమ్రాన్, తస్లీం సుల్తానా, సౌజన్య వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 427 మంది వైద్య సేవలు పొందారు. 189 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, 14 మంది మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సీహెచ్‌ఓ రమణమ్మ, సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి, సీతారాములమ్మ, ఫార్మసిస్ట్ రాజేష్, ఏఎన్‌ఎంలు మాధవి, నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చాగలమర్రిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వైఎస్సార్ బీమా ఆర్థిక సాయం అందజేత

రుద్రవరం: మందలూరులో సిద్ది పార్వతి అనే బాధితురాలికి శనివారం గ్రామ సర్పంచు సగిలి నిర్మలదేవి, మండల ఉపాధ్యక్షుడు వీరశంకర్ రెడ్డి, వీఆర్వో ఫకృద్దీన్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి కలిసి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సిద్ది బాలనాగిరెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయాన్ని అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలోనే బాధితురాలి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు.

శిరివెళ్ల: గుండంపాడుకు చెందిన మల్లెల దానమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శనివారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సహాయంగా రూ. 10 వేలను ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, సర్వ నరసింహ్మస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డిలు మృతుని కుటుంబీలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రతాపరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.